# తెలంగాణ ప్రాపంచిక దృష్టి

ఎమర్జన్సీ అనంతరం మళ్ళీ పుంజుకుంది. అనేక ఒడిదుడుకుల్ని ఎదుర్కొంటూ తెలంగాణ ప్రజా చైతన్యంలో భాగమై నిలిచింది. 1990లలో అస్తిత్వవాద ఉద్యమాల్లోనూ తెలంగాణ తనదైన పాత్రని పోషించింది. ఇతర ప్రజా ఉద్యమాల్లోనూ తెలంగాణవాసులే ముందు నిలిచారు. ఇవాళ ప్రత్యేకరాష్ట్రం కావాలన్న ఆకాంక్ష తెలంగాణలో బలీయంగా ఉండటం, అందుకోసం వివిధస్థాయిల్లో సంఘటితం కావడం తెలంగాణ ప్రజల్లో పోరాడే తెగువని సూచిస్తోంది. ఇది తెలంగాణ జనజీవన సంస్కృతిలో అవిభాజ్య భాగం. ఇది తెలంగాణకే ప్రత్యేకం.

## పునర్విశ్లేషణ

తెలంగాణ ప్రాంతీయ చైతన్యం నెలకొన్నాక సకల రంగాల్లో పునర్విశ్లేషణా క్రమం మొదలయింది. తెలంగాణ రాష్ట్ర ఆకాంక్ష బలపడిన నేపథ్యంలో తెలంగాణ జాతి, అస్తిత్వం, చరిత్ర, రాజకీయాలు, భాష, సాహిత్యం, సంస్కృతికి సంబంధించిన అంశాల్ని పునర్విశ్లేషిస్తున్నారు. తెలంగాణ చరిత్రని పునర్నిర్మించే క్రమానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటివరకు ఇతరులు తెలంగాణ గురించి చెబుతున్న అంశాలకే ఎక్కువ ప్రచారం లభించింది. కానీ ఇక్కడివారే తెలంగాణ అంటే ఏమిటో చెబుతున్నారు. ఇతరులు తెలంగాణ గురించి చేసే రచనల్ని విమర్శకు పెడుతున్నారు. వాటి సాధికారికతని ప్రశ్నిస్తున్నారు. విద్య, వైద్యం, ఆహారం, వ్యవసాయం, జలవనరులు వంటి అంశాలకు సంబంధించి తెలంగాణకు వున్న ప్రత్యేకతల్ని చర్చకు పెడుతున్నారు. తమదయిన కోణంలోంచి చూడటం ఇప్పుడు అలవడింది. ఇక్కడి జానపదకళల ప్రత్యేకతల గురించీ, కళాకారుల జీవనరీతి గురించి వెలుగులోకి తీసుకువస్తున్నారు. ఇక్కడి జీవితంలో ముడిపడిన జానపదకళల అంతస్సారాన్ని అర్థం చేసుకోడానికి ఈ కృషి తోడ్పడుతుంది. ఇదంతా తెలంగాణ సామాజిక చరిత్రని తిరగరాసే క్రమానికి దోహదపడుతుంది. వివిధరకాల సంస్థలు ఈ దిశగా కృషి చేస్తున్నాయి. సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో ఈ పునర్విశ్లేషణా క్రమం ఎంతో సృజనాత్మక ప్రతిభ వెలికి రావడానికి ఉపకరించింది. ఇక్కడి భాషలో వున్న వైశిష్ట్యాన్ని తేల్చిచెప్పింది. ఇరవయ్యో శతాబ్దపు తొలినాళ్ళలో తెలంగాణలో గ్రంథాలయాలు ఏర్పడ్డాయి. పత్రికలు ఎన్నో వచ్చాయి. పుస్తకాలు ఎన్నో వచ్చాయి. ఈవిధంగా తెలంగాణ చరిత్రని పునర్విశ్లేషించుకోవడం వల్ల తెలంగాణ ప్రత్యేకత మరింతగా లోకానికి వెల్లడవుతుంది.

## సర్వసమభావనా వాదం

తెలంగాణీయుల ప్రాపంచిక దృష్టికి సర్వసమభావనా వాదమే ఆధారం అంటారు దాగ్మార్ బెర్న్ స్టార్స్ అనే రచయిత. ఈయన తెలంగాణ రాజకీయాలపై ప్రత్యేకంగా పరిశోధనలు చేసి 'కింగ్‌మేకర్స్' అనే పుస్తకం రాశారు. అందుకే ఇతర ప్రాంతాలవారిని ఆదరించారు. ఇతర భాషల్ని ఆదరించారు. తమలో కలుపుకున్నారు. ఈ సంస్కారం, సామరస్య దృష్టి తెలంగాణలో ఇప్పటికీ వుంది. ఈ కారణం వల్లనే కావచ్చు తెలంగాణకీ, హైదరాబాద్‌కి ఎవరు వచ్చినా ఇక్కడే స్థిరపడిపోవాలనుకుంటారు. రైల్వేలో పని చేసిన తమిళులు, వ్యాపారం కోసం వచ్చిన మార్వాడీలు, ఉద్యోగాల కోసం వచ్చిన ఉత్తర భారతీయులు, బెంగాలీలు, ఒరిస్సా వాళ్ళు, గుజరాతీలు, మహారాష్ట్రీయులు, పార్శీలు, కన్నడిగులు, కేరళీయులు, నేపాలీలు, కాశ్మీరీ పండితులు... ఇంకా ఎందరో ఇప్పటి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ల వరకూ అందరూ సుందరమైన సుసంస్కృతి కల హైదరాబాద్‌లో స్థిరపడాలనుకుంటారు. తెలంగాణ జీవితంలోని మిశ్రమసంస్కృతిని చూసి ముచ్చటపడతారు.

అయితే ప్రపంచీకరణ ప్రభావం కారణంగా తెలంగాణ ప్రాంతం ఇతరేతర ప్రభావాలకు లోనవుతోంది. గత పది, పదిహేను సంవత్సరాలుగా తెలంగాణలో అనేక మార్పులు వస్తున్నాయి. వస్తు వినిమయ సంస్కృతి పెరిగింది. విందులు, వినోదాల్లో కొత్తపోకడలు కనిపిస్తాయి. ఇళ్ళ నిర్మాణంలోనూ దీనిని చూడొచ్చు. అపార్ట్‌మెంట్‌లు హైదరాబాద్‌కే పరిమితం కాలేదు. దాదాపుగా తెలంగాణ జిల్లాలన్నిటా అపార్ట్‌మెంట్‌లు వెలుస్తున్నాయి. చిన్నచిన్న పట్టణాల్లోనూ అపార్ట్‌మెంట్ల నిర్మాణం, ఈటింగ్‌ఔట్ సంస్కృతి, వృద్ధాశ్రమాలు ఏర్పడటం, మండల కేంద్రాల్లోనూ వెలసిన బ్యూటీపార్లర్లు, వస్త్రధారణలో వచ్చిన మార్పులు ఈతరం తెలంగాణవాసుల ధోరణిలో వచ్చిన మార్పును సూచిస్తున్నాయి. అయినప్పటికీ మాటతీరులో, మర్యాదల్లో, నడవడికలో నెమ్మదితనం, నింపాదితనం తెలంగాణవాసుల్లో కనిపిస్తాయి. అంతేగాక అనేకానేక ప్రభావాల నడుమ కూడా తమ సంప్రదాయాల్నీ, సంస్కృతుల్నీ కొనసాగించడం పట్ల ఆసక్తి చూపిస్తారు. ఏటా జరిగే బోనాల పండగ, బతుకమ్మ పండగ, దసరా దీపావళి ఉత్సవాలు, వివిధ ప్రాంతాల్లోని జాతరల్లో భాగస్వాములు కావడం ఇక్కడి సంస్కృతితో వున్న మమేకతని తెలియజేస్తుంది. తెలంగాణ ప్రాంతంలో, జీవనవిధానంలోని విశిష్టతలకు ఇది తార్కాణం.

– సండే డెస్క్

(అభిప్రాయాల సేకరణ: దోర్బల-హైదరాబాద్
శెంకేసి శంకరరావు-వరంగల్; యాదగిరి-సంగారెడ్డి
ఎం.షంషుల్లా-నాగర్‌కర్నూలు)

## తెలంగాణ సామెతలు

* ఏరు ముందా! ఏకాశి ముందా!
* అరిచేతుల బెల్లంబెట్టి, మోచేయిదాక నాకిస్తడు.
* ఉపమెరుగని దాసరి, ఊల్లె ఉపాసం బన్నట్టు!
* ఎడ్లెంటనే ముడ్లు!
* అడ్డ గూడూరుకు బిడ్డ నియ్యొద్దు,
* వర్ధమాన కోటకు ఎద్దు నమ్మొద్దు!
* పోలుమల్ల కల్లు పోశినంతే చాలు!
* ఎండ పొయ్యన్న సూడాలె! ఇంట్ల ఉండన్న జూడాలె!
* కందికాయకు సమురుండదు, కాపోనికి నెవరుండదు.
* పున్నమినాడు చేయూపితె రానామె,
  అమాస నాడు కన్నుగొడితె వస్తాది!
* కడుపొచ్చినా ఆగదు, కక్కొచ్చినా ఆగదు!
* వండుకున్నామె తినక మానదు,
  కడుపుతో ఉన్నామె కనక మానదు!
* అంగట్లో అవ్వా అంటె,
  ఎవ్వని కడుపుల పుట్టినవుర బిడ్డా? అందట!
* దరిద్రుని పెండ్లికి, వడగండ్ల వానని!
* అడ్డాల నాడు బిడ్డలుగాని,
  గడ్డాలొచ్చక బిడ్డలా?
* మాటలు నేర్చిన కుక్క ఉస్కో అంటె ఉస్కో అందట!
* జన్మకో శివరాత్రని!
* ఆడ పెత్తనం, తంబళ్ళ దొరతనమని!
* చింతకాయలమ్ముకొనేటామెకు సిరొస్తెనట; మల్ల ఆ
  కాయలు గనబడ్డప్పుడు, ఏం కాయలివి?
  వంకటింకర కాయలన్నదట!
* వానలుబడె, వాతలు మానె!
* మల్లె బిడ్డ నీళ్ళు రావు, పైన బడ్డ దెబ్బ రాదు!
* కాపు కక్కసం - కంసలి కుయ్యత్తం.
* రెడ్డోనికి రేగిముల్లుకు వరసేంది!

సేకరణ: పగడాల

మౌలాలి దర్గ (రంగారెడ్డి)





సంస్కృతికి
ప్రతిబింబం
బతుకమ్మ పండగ

## ధిక్కారం- తెలంగాణ సాహిత్యం



"పదుపు కూడు భుజించుట కంటె హాలికులైన మేలు"

అన్న పోతన ధిక్కార స్వర స్ఫూర్తితో తెలంగాణ సాహిత్య మాగాణిలో విభిన్న రకాలైన రచనల పంటలు పండాయి. తాను రాసిన కృతిని అంకితమివ్వమని రాజు అడిగినప్పటికీ ఇవ్వకుండా తన రచనను రాముడికి అంకితమిచ్చి ధిక్కారాన్ని ప్రకటించిన పోతానామాత్యుని ప్రభావం తెలంగాణ సాహిత్యంలో స్పష్టంగా కనిపిస్తుంది. పాల్కురి సోమనాథుడు జాను తెలుగులో రాసిన సాహిత్యం ఇక్కడి ప్రత్యేకత. మెదక్ జిల్లా పొట్లచెరువు (పటాన్‌చెరువు)కు చెందిన కవి రచించిన యయాతి చరిత్ర తెలుగు సాహిత్యంలో మొట్టమొదటి అచ్చ తెలుగు కావ్యం. తెలంగాణ సాహిత్యంలో స్థానిక (దేశీ) కవిత్వం ఎక్కువగా కనిపిస్తుంది. ఈ ప్రాంతానికి ఆధునికత అందుబాటులో లేకపోవడంవల్ల రూపంలో పద్య కవిత్వం ఎక్కువగా కనిపిస్తుంది. కోస్తా ప్రాంతంలో వచన కవిత్వం అభివృద్ధి చెందిన క్రమంలో ఈ ప్రాంతం నుంచి వెలువడిన కవిత్వంలో అభ్యుదయం ఉన్నప్పటికీ రూపంలో సాంప్రదాయం కనిపిస్తుంది. కోస్తాలో గ్రాంధిక వ్యవహార భాషల మధ్య వాదోపవాదాలు జరిగిన క్రమంలో ఇక్కడ రచయితలు గ్రాంధిక భాషకు పరిమితమయ్యారు. తెలంగాణ సాహిత్యంలో ఉర్దూ, అరబ్బీ, మరాఠీ, కన్నడ భాషల ప్రభావం కనిపిస్తుంది. ప్రేమ్‌చంద్, గాలిబ్, ఇక్బాల్ మొదలగు కవుల గజల్, రుబాయి ప్రక్రియలు ఇక్కడి సాహిత్యంలో ప్రతిఫలిస్తాయి. ప్రణయ భావాల్లో సైతం తాత్విక ధోరణులు ఉంటాయి. తెలంగాణ సాహిత్యానికి వస్తువు, జీవితం, ఉద్యమాలు, సమాజం, అనుభవాలు పునాదులుగా నిలుస్తాయి.

అలాగే ప్రజల గుండెల చప్పుళ్ళు ఇక్కడ పాటలై ప్రవహించాయి. తెలంగాణ రైతాంగ పోరాటం, విప్లవోద్యమం, తెలంగాణ ఉద్యమం ఇక్కడి పాటలకు ప్రాణాలు పోశాయి. గ్రామీణ వ్యవస్థ విధ్వంసం, వ్యవసాయ సంక్షోభం, వలసలు, భూస్వామ్య వ్యతిరేక ఘర్షణలు ఇక్కడి సాహిత్యంపై ప్రభావం చూపాయి. ఇక్కడి పాటలు ప్రజల జీవితాల్లోని అన్ని దశల్లో పెనవేసుకున్నాయి. ఇక్కడ గోదావరి, కృష్ణ నదులతోపాటు ఇతర నదులు ఉన్నప్పటికీ సాహిత్యంలో చెరువులు, ఏరులు, బావుల వర్ణనలే ఎక్కువగా కనిపిస్తాయి. అన్య భాషల సమ్మేళనం ఇక్కడి సాహిత్యంలో స్పష్టంగా కనిపిస్తుంది. సిద్ధాంత ప్రభావం కంటే ఆచరణ, క్రియాశీల ప్రభావం సాహిత్యంలో చూడొచ్చు. ఇక్కడి సాహిత్యకారులు ఉద్యమంలో, యుద్ధంలో కూడా ఉండడం వల్ల సాహితీ కళా రూపాల చైతన్యం సంపూర్ణంగా లేకపోవడం వల్ల వారి అనుభవాలన్నీ రచనలుగా రూపుదిద్దుకోలేదు. కవిత్వంలో, కథల్లో తెలంగాణ భాష ప్రదర్శించడానికి స్వేచ్ఛా వాతావరణం లేదు. ఫలితంగా రచయితలు అదనపు ప్రయాసను భరించారు. ఇక్కడ ఉద్యమం, సాహిత్యం వేర్వేరు కాదు. రచయిత, కార్యకర్త వేర్వేరు కాదు. రచయితే కార్యకర్తగా, ప్రచురణ కర్తగా, ప్రచారకర్తగా అదనపు బాధ్యతలను మోయవలసిన పరిస్థితి ఉన్నది.

**– డా.నందిని సిధారెడ్డి, అధ్యక్షులు, తెలంగాణ రచయితల వేదిక**

నంది (వరంగల్)

